సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 30 । మే । 2023



మన్యం తాండ్ర అదరహో

మన్యం తాండ్ర మహారుచిగా ఉంటుంది. గిరిజన మహిళలు సంప్రదాయబద్ధంగా ఈ తాండ్రను తయారు చేస్తారు. 8లో



వలంటీర్లకు సన్మానం

కొయ్యూరు ఎంపీడీవో కార్యాలయంలో వలంటీర్లకు సోమవారం వందనం కార్యక్రమం నిర్వహించారు. 8లో



జీడికి సిండికేట్ దెబ్బ

జీడి పిక్కల ధరలు నేలచూపు చూస్తున్నాయి. దిగుబడి పెరిగినా రేటు తగ్గిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో

మోసం చంద్రబాబు నైజం

పేదలకు ఇచ్చే స్థలాలపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పాడేరు, అరకులోయ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున బైక్‌ర్యాలీలు నిర్వహించారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ర్యాలీల్లో ఎమ్మెల్యేలు కొట్టగొళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

- పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ
- చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా బైక్ ర్యాలీలు



కొయ్యూరులో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, వైఎస్సార్‌సీపీ నాయకులు

కొయ్యూరు: రాష్ట్రంలో ఉనికి కోల్పోయిన టీడీపీ అమలు చేయడానికి సాధ్యం కాని హామీలతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు యత్నిస్తోందని పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి అన్నారు. మహానాడును మాయనాడుగా మార్చి, అమలు చేయలేని హామీలతో మరోసారి ప్రజలను ఏ మార్చాలని చంద్రబాబు చూస్తున్నారని విమర్శించారు. అమరావతిలో పేదలకు భూములు ఇవ్వడంపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సోమవారం కొయ్యూరు నుంచి కాకరపాడు వరకు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాకరపాడు జంక్షన్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా భారీగా హాజరైన కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమ్మ ఒడి పథకం అమలు చేస్తుంటే దానిపై విమర్శించిన చంద్రబాబు అదే పథకాన్ని కాపీ కొట్టారని, పేరు మార్చి టీడీపీ మేనిఫెస్టోలో పెట్టారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే పేదలను ధనికులుగా చేస్తామని చంద్రబాబు చెబుతున్నారని, 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయనకు పేదలు గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు.అమ్మకు వందనంపై చంద్రబాబు స్పష్టత ఇవ్వాలన్నారు.ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ ఇస్తారా లేకుంటే ఒకరికి ఇస్తారా చెప్పాలన్నారు. ఇక 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారికి నెలకు రూ.1500 ఇస్తామంటున్నారని, ఇది అమలు సాధ్యం కాదన్నారు.అధికారంలోకి రావడం కోసం అడ్డదారులు తొక్కడం,వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను మరచిపోవడం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన 600 హామీలను మాఫీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, సీనియర్ నేత గాడి సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలు,అప్పన వెంకటరమణ,పార్టీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు,ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు,జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు గొడ్డేటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పతనం ఖాయం

అరకులోయ రూరల్: రాష్ట్రంలో టీడీపీకి గడ్డుకాలం మొదలైందని, ఆ పార్టీ పూర్తిగా పతనం కావడం ఖాయమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న ఇళ్ల స్థలాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు వ్యతిరేకంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో డుంబ్రిగుడ మండలం జైపూర్ జంక్షన్ నుంచి అరకు సంతబయలు,యండపల్లి వలస మీదుగా అరకులోయ వరకు వెయ్యి బైక్‌లతో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఆరు మండలాల పరిధిలోని ముఖ్యనాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు,ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు తప్పుడు వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయిస్తే సమాధికి ఉపయోగపడుతుందని మాట్లాడటం అహంకారానికి నిదర్శనమన్నారు. టీడీపీకి భవిష్యత్తు లేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే టీడీపీ నేతలు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు.వారు నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన గుణపాఠం తప్పదన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీలు శెట్టి నీలవేణి, ఉషారాణి,ఈశ్వరి,రాజాబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగధారస్వామి,యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి శెట్టి వినయ్, జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు రామన్న, రంజిత్‌కుమార్, మొస్య,రమేష్,సింహాచలం, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

4 నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు



సాక్షి,పాడేరు: మన్య ప్రజల ఆరాధ్యదైవం మోదకొండమ్మ తల్లి ఉత్సవాలను పాడేరుకు సమీపంలోని నక్కలపుట్టులో వచ్చేనెల 4వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఈమేరకు కిండంగి పంచాయతీ పెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు.పాడేరు రోడ్డులోని మోదకొండమ్మ తల్లి ఆలయం నుంచి సేరుబయలు,కిండంగి రోడ్డులలో విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కర్రి రమణ తెలిపారు.

'స్పందన' సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: స్పందనలో అర్జీదారులు తెలిపిన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాల్‌లో సోమవారం వివిధ శాఖల అధికారులు, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఏపీవో జనరల్ సీహెచ్ శ్రీనివాసరావు కలిసి పీవో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ 36 అర్జీలు స్వీకరించినట్టు చెప్పారు. వీటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశించినట్టు తెలిపారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

జి.మాడుగుల: టెన్త్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని పాడేరు డీడీ కొండలరావు తెలిపారు. టెన్త్ ఫెయిల్ అయిన విద్యార్థులకు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాల, గాంధీనగరంలోని బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా పాఠ్యాంశాలు బోధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కావాలన్నారు. ఏటీడబ్ల్యూవో తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ



అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న పీడీ సూర్యలక్ష్మి

డుంబ్రిగుడ: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు పౌష్టికాహారాన్ని పూర్తిస్థాయిలో సక్రమంగా అందించాలని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి తెలిపారు. మండలంలోని పోతంగి పంచాయతీ బోడిగుడ అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆమె తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. అనంతరం చిన్నారులకు పంపిణీ అవుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. గర్భిణులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రసవానికి ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలని సూచించారు. అనంతరం నాడు-నేడు పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సీడీపీవో నీలిమను ఆదేశించారు.

జలవిద్యుత్ కేంద్రంలో రోటర్ తొలగింపు



రోటర్‌ను తొలగిస్తున్న సిబ్బంది

సీలేరు: స్థానిక ఏపీ జెన్‌కో జలవిద్యుత్ కేంద్రంలో నిర్వహిస్తున్న మరమ్మతు పనుల్లో భాగంగా సోమవారం రోటర్‌ను తొలగించారు. 60 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే నాల్గో నంబర్ యూనిట్ సుమారు రెండు నెలల క్రితం పాడైంది. ఈ మరమ్మతు పనులను అభిరామ్ కంపెనీకి ఏపీ జెన్‌కో అప్పగించింది. ప్రస్తుతం పనులు జరుగుతుండగా, సోమవారం యూనిట్‌కు సంబంధించి లోపల ఉండే రోటర్ అనే భారీ పరికరాన్ని క్రేన్ సాయంతో తొలగించారు. ఈ పనులను చీఫ్ ఇంజినీర్ శ్రీధర్ పరిశీలించారు. మరమ్మతులు పనుల్లో సూపరింటెండెంట్ ఇంజినీర్ ప్రశాంత్‌కుమార్, డీఈఈ లక్ష్మీనారాయణ,కార్మికులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

- ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ డైరెక్టర్ తాతయ్య



బొడ్డాపుట్టులో గిరిజనులతో మాట్లాడుతున్న తాతయ్య, మల్లికార్జునరావు, భవాని

హుకుంపేట: గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అధికారుల కృషి చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ డైరెక్టర్ తాతయ్య అన్నారు. మండలంలోని తడిగిరి పంచాయతీలో సోమవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. తడిగిరి,బొడ్డాపుట్టు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు,ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన చెరువులను, మెరకచింతలో నిర్మిస్తున్న రోడ్డును పరిశీలించారు. నిర్మాణ పనులు సక్రమంగా జరుగుతుండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. తీగలవలస పంచాయతీ పాములాయి, కిన్నెర్లోవా గ్రామాల్లో కొండపోడుపై రైతులు ఆధారపడి ఉంటారు కాబట్టి వారికి కాఫీ, మిరియాలు, సపోట తదితర మొక్కలు అందించి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేయాలని ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు. అనంతరం గిరిజన రైతులతో మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా ప్రభుత్వం కల్పించిన పనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జునరావు, ఉద్యానవన శాఖ డిప్యూటీ కమిషనర్ భవాని, పీడీ రాజారమేష్, ఈసీ వెంకటరమణ, సర్పంచ్ పెనుమల రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సౌకర్యాల పెంపునకు చర్యలు

- కలెక్టర్ సుమిత్ కుమార్
- ఎల్లవరం ఆస్పత్రి,సచివాలయం తనిఖీ



జడ్డంగి పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

అడ్డతీగల: రోగుల అవసరాల మేరకు పీహెచ్‌సీలో సౌకర్యాల పెంపునకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. అడ్డతీగల మండలం ఎల్లవరం పీహెచ్‌సీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజూ ఎంత ఓపీ నమోదు అవుతోంది, ఇన్‌పేషెంట్లు ఎంతమంది ఉంటున్నారు, మందులు సరిపోతున్నాయా, లేదా తదితర అంశాలపై ఆరాతీశారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. 100 నుంచి 120 వరకూ ఓపీ నమోదవుతోందని సిబ్బంది చెప్పారు. ఆస్పత్రికి మందుల కేటాయింపు పెంచాలని వారు కోరారు. ఇన్‌పేషెంట్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అభ్యర్థన మేరకు ఆస్పత్రిలో 13 బెడ్ల ఏర్పాటుకు ఫర్నిచర్ అందజేయడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు.అనంతరం ఎల్లవరం సచివాలయాన్ని తనిఖీ చేశారు.పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

డ్రాపౌట్స్‌ను గుర్తించి బయట ఉన్న బాలబాలికలందరినీ బడిలో చేర్పించాన్నారు. మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని, బాలబాలికల్లో రక్తహీనత లేకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

జడ్డంగి పీహెచ్‌సీ తనిఖీ

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పీహెచ్‌సీని కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందుల స్టాక్, రికార్డులు పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పాడేరు నుంచి రంపచోడవరం వెళుతూ మార్గమధ్యంలో గల జడ్డంగి ఆస్పత్రిని ఆయన పరిశీలించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుజికి సూచనలు ఇచ్చారు.

కేజీబీవీల్లో కొలువుల జాతర

- 128 కొత్త పోస్టుల భర్తీకి చర్యలు
- మహిళలకు అవకాశం



హుకుంపేటలోని కేజీబీవీ

సాక్షి,పాడేరు: కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ప్రత్యేకాధికారులతో పాటు బోధన సిబ్బంది పోస్టులను మహిళలతో భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలోని 19 కేజీబీవీల్లో 128 పోస్టులను కాంట్రాక్టు పద్ధతిపై భర్తీ చేసేందుకు సమగ్రశిక్ష యంత్రాంగం నోటిఫికేషన్ జారీ చేసింది.దీంతో జిల్లాలోని అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తులు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీల్లో నాణ్యమైన వసతులతో కూడిన విద్యను బాలికలకు అందిస్తోంది.ఈ మేరకు అన్ని కేజీబీవీలు ఇంటర్మీడియెట్ స్థాయికి రెండేళ్ల కిందట అప్‌గ్రేడ్ అయ్యాయి.అన్ని విద్యాలయాల్లోను పూర్తిస్థాయిలో బోధన సిబ్బందిని నియమించి, నాణ్యమైన విద్యాప్రమాణాలు లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు పోస్టులు భర్తీ చేయనుంది.

భర్తీ కానున్న పోస్టుల వివరాలు

12 కేజీబీవీల్లో ప్రత్యేకాధికారుల(ప్రిన్సిపాళ్ల) నియామకాలు చేపట్టనున్నారు. 41 సీఆర్టీలకు సంబంధించి పీఈటీ-1, తెలుగు-5, హిందీ-3, ఇంగ్లిషు-7,గణితం-5,పీఎస్-5,ఎన్ఎస్-8,సోషల్-4 పోస్టులు, 74 పీజీటీలకు సంబంధించి తెలుగు-12, ఇంగ్లిషు 11, గణితం-8, ఫిజిక్స్ 12, కెమిస్ట్రీ-9, బోటనీ-4,జువాలజీ-4,హిస్టరీ-1,ఎకనామిక్స్-3, సివిక్స్-5, కామర్స్ -4, జీఎఫ్‌సీ-1 పోస్టులు భర్తీ కానున్నాయి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఈపోస్టులన్నీ మహిళా అభ్యర్థులతోనే భర్తీ చేయనున్నారు. apkgbv.apcfss.in వెబ్‌సైట్ ద్వారా రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు తెలిపారు.జూన్ 4వతేదీ రాత్రి 12 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు గడువు ఉంది. ఆఫ్‌లైన్ ద్వారా, నేరుగా దరఖాస్తులు స్వీకరించరు. ఓపెన్ కేటగిరి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 42 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ,ఎస్టీ,బీసీ అభ్యర్థులకు 5 ఏళ్లు,మాజీ సైనిక ఉద్యోగులకు మూడేళ్లు,దివ్యాంగులకు 10ఏళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుంది. జిల్లాలో పోస్టుల ఖాళీలు,ఆయా పోస్టులకు విద్యార్హతలన్నీ పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో 128 పోస్టులను కాంట్రాక్టు పద్ధతిపై ఏడాది కాలానికి భర్తీ చేస్తున్నాం.అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. ఆఫ్‌లైన్ లేక దరఖాస్తులను కార్యాలయాల్లో స్వయంగా స్వీకరించడం జరగదు.అభ్యర్థులంతా వెబ్‌సైట్‌లో అన్ని వివరాలను నమోదు చేసి, ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలి

\- సలీమ్‌బాషా,
డీఈవో,అల్లూరి సీతారామరాజు జిల్లా

ప్రశాంతంగా పాలిటెక్నిక్ కౌన్సెలింగ్



ప్రిన్సిపాల్ సుజాత

సాక్షి,పాడేరు: పాలిటెక్నిక్ కాలేజీలో ప్రవేశానికి సంబంధించి కౌన్సెలింగ్ ప్రారంభమైంది. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సోమవారం తొలిరోజు కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. అర్హులైన విద్యార్థుల ధ్రువీకరణపత్రాలను పరిశీలించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు.తొలిరోజు 1నుంచి 12వేల ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించినట్టు తెలిపారు. 30న 12,001 నుంచి 28,000 ర్యాంకులు, 31న 28,001ర్యాంకు నుంచి 43,000 వరకు,జూన్ 1న 43,001 నుంచి 58,000 వరకు, 2న 58,001 నుంచి 74,000 వరకు, 3న 74,001 నుంచి 91,000 వరకు, 4న 91,001 నుంచి 1,08,000వరకు, 5న 1,08,001 నుంచి చివరి ర్యాంకు వరకు అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించనున్నట్టు చెప్పారు. 6వ తేదీ వరకు ఆన్‌లైన్ ఎంపిక (వెబ్ ఆప్షన్) ప్రక్రియ జరుగుతుందన్నారు. పాడేరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న వెబ్ కౌన్సెలింగ్‌ను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు appolycet.inc.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజును చెల్లించాలన్నారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవితఖైదు



శివ ప్రసాద్(ఫైల్)

జి.మాడుగుల: భార్య హత్యకేసులో భర్తకు జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ విశాఖపట్నం 6వ ఏడీజే కమ్ మహిళా కోర్టు జడ్జి ఎం.సువర్ణరాజు సోమవారం తీర్పు చెప్పారు. స్థానిక సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జి.మాడుగుల మండలం కుంబిడిసింగి పంచాయతీ ఉర్లమెట్ట గ్రామంలో 2021సంవత్సరం ఆగస్టు 1న వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో భార్య సంపతి భానుమతిని సోమెలి శివ ప్రసాద్ కత్తితో దారుణంగా నరికి చంపాడు. నిందితుడు శివ ప్రసాద్‌ను అదే నెల 3న అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేసి విశాఖపట్నం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసుపై విశాఖపట్నం అడిషనల్ జిల్లా మహిళా కోర్టు జడ్జి ఎదుట పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.శైలజ వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలు, వాదోపవాదనలు పరిశీలించిన మీదట శివప్రసాద్‌కు జీవిత ఖైదు విధిస్తూ జడ్జి ఎం.సువర్ణరాజు తీర్పు చెప్పారని సీఐ, ఎస్ఐలు తెలిపారు.

గాలివాన బీభత్సం

- ఉరుములు, మెరుపులతో భీతిల్లిన ప్రజలు
- ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



రాజవొమ్మంగి- సూరంపాలెం మధ్య కూలిన వృక్షం



కొయ్యూరులో కూలిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

హుకుంపేట/గూడెం కొత్తవీధి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. భారీ చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. హుకుంపేట మండలంలోని తీగలవలస,మట్టుజోరు,తడిగిరి,శోభకోట పంచాయతీల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం కారణంగా గూడెంకొత్తవీధి మండలంలోని ఆర్వీనగర్ వారపు సంతలో వ్యాపారులు, గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులకు రహదారులపై పలు చోట్ల చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. రహదారులపై వర్షపునీరు ప్రవహించింది.

కొయ్యూరు: ఈదురు గాలులకు చింతలపూడి సమీపంలో భారీ వృక్షం నేలకూలింది. సుమారు రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రెండు పొక్లెయిన్‌ల సాయంతో చెట్ల కొమ్మలను నరికి పక్కకు నెట్టారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీరింది.

రాజవొమ్మంగి: మండలకేంద్రం రాజవొమ్మంగిలో సోమవారం భారీ వర్షం కురిసింది. సూరంపాలెం, కొండపల్లి, లబ్బర్తి, లాగరాయి, కింద్ర, నెల్లిమెట్ల, అప్పలరాజుపేట, అమ్మిరేఖల గ్రామాల్లో పెద్ద పెద్ద శబ్దాలతో పిడుగులు పడడంతో స్థానికులు భయాందోళనకుగురయ్యారు. ఈదురుగాలులకు రాజవొమ్మంగి-సూరంపాలెం గ్రామాల మధ్య జాతీయరహదారిపై ఓ పెద్ద చెట్టు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు గంటల కొద్దీ ఆటంకం కలిగింది. స్థానిక ఎస్ఐ గోపీనరేంద్రప్రసాద్ స్థానిక యువకుల సాయంతో చెట్టును తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది.

వై.రామవరం: గాలివాన బీభత్సంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగిపడగా తీగలు తెగిపడి మండలం అంధకారం నెలకొంది. తాగునీటి పథకాలు పనిచేయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

విద్యార్థుల సామర్థ్యంపై ప్రత్యేక పరిశీలన



మాట్లాడుతున్న ఏడీసీ ప్రోగ్రాం సమన్వయకర్త నారాయణరెడ్డి

చింతపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించేందుకు నీతిఅయోగ్ సూచన మేరకు కేంద్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు జిల్లా ఏడీసీ ప్రోగ్రాం సమన్వయకర్త జి.నారాయణ రెడ్డి తెలిపారు.ఏస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి అయోగ్ సూచన మేరకు దేశ వ్యాప్తంగా 780 జిల్లాల్లో ఈ కార్యక్రమం అమలవుతోందన్నారు. మన రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో ఈ కార్యక్రమం అమలులో ఉందన్నారు. అల్లూరి జిల్లాలో చింతపల్లి, జి.మాడుగుల,పాడేరు మండలాలను ఎంపిక చేసినట్టు చెప్పారు.చింతపల్లిలో 34 పాఠశాలలను గుర్తించినట్టు తెలిపారు. మూడు, నాలుగు, ఐదు తరగతులు చదువుతున్న విద్యార్థుల వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేయాలన్నారు. యాప్ నిర్వాహణ,విద్యార్థుల నమోదు పక్రియ వంటి అంశాలపై ఈ కార్యక్రమంలో చర్చించారు. ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, ఏపీవో కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీసు స్టేషన్ భవన నిర్మాణ పనుల పరిశీలన



సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ నాయుడుతో చర్చిస్తున్న సీఐ రాంబాబు

వై.రామవరం: స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం సీఐ వై.రాంబాబు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నెలలో వచ్చిన కేసులు, గతంలో పెండింగులో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ భద్రతా ఏర్పాట్లను, స్టేషన్ ఆవరణలో ఉన్న సిఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసు బలగాల భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, సూచనలిచ్చారు. సీఆర్‌పీఎఫ్ విధులపై బెటాలియన్ అసిస్టెంటు కమాండెంట్ నాయుడుతో చర్చించారు. సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. పోలీసు స్టేషన్ భవన నిర్మాణపు పనులను పరిశీలించారు. అనంతరం వాహన తనిఖీల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్ఐ సంతోష్ కుమార్, వారి సిబ్బంది పాల్గొన్నారు.

మన్యం తాండ్ర అదరహో

- కొండ మామిడి పండ్లతో తయారీ
- సహజ సిద్ధమైన తాండ్రకు గిరాకీ



తాండ్ర తయారీకి ఎండలో చేటలలో ఆరబెట్టిన మామిడి రసం

ముంచంగిపుట్టు: మన్యంలో అటవీ ప్రాంతాల్లో లభించే మామిడి పండ్లతో తయారు చేసే తాండ్ర తింటే మహారుచిగా ఉంటుంది. గిరిజన మహిళలు సంప్రదాయబద్ధంగా తాండ్రను తయారు చేస్తారు. దీంతో మన్యం తాండ్రకు మంచి గిరాకీ నెలకొంది. విశాఖ మన్యంలో గిరిజన గ్రామాల్లో ప్రస్తుతం ఇళ్ల ముందు చేటలు, చాపలు, ప్లేట్లతో మామిడి తాండ్ర తయారు చేసే పనుల్లో నిమగ్నమై ఉన్నారు. వారపు సంతలో తాండ్ర కిలో రూ.100 నుంచి రూ.120 వరకూ విక్రయిస్తున్నారు. అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మామిడి పండ్ల సీజన్ అయిపోయినా తాండ్రను భద్ర పరుచుకొని తినే అవకాశం ఉండడంతో డిమాండ్ నెలకొంది.

సహజ సిద్ధంగా తయారీ

మన్యంలో గిరిజన గ్రామాలకు అనుకొని ఉన్న కొండ,అటవీ ప్రాంతాల్లో మామిడి చెట్లకు కాసే కొండ మామిడి పండ్లను ఇంటిల్లి పాది ఉదయం, సాయంత్రం సమయాల్లో వెళ్లి మామిడి పండ్లను సేకరించి వాటిని శుభ్ర పరిచి పెద్ద డబ్బాలు, బిందెలలో వేసి రోకలితో దంచుతారు. దంచగా వచ్చిన మామిడి రసాన్ని చేటలు, ప్లేట్లు, చాపలులో పలుచగా వెదజల్లేలా ఆరబెడతారు. వీటిలో ఎటువంటి రసాయనాలు కలుపకుండానే పొరలు,పొరలుగా వేసి వారం ,పది రోజులుగా ఆరబెట్టి తాండ్రను తయారు చేస్తారు.

మామిడి పండ్లతో పలు తయారీలు

మామిడి పండ్లను ఒక డబ్బాలో వేసి రోకలితో దంచగా వచ్చిన రసాన్ని తాండ్రగా తయారు చేయగా మిగిలిన మామిడి తొక్కలను, టెంకలను వేరు చేసి ఎండబెడతారు. తొక్కలను కొందరు కారంతో, మరి కొందరు బెల్లంతో కలిపి ఎండ బెడతారు. బాగా ఎండిన తర్వాత వీటిని డబ్బాలలో నిల్వ చేసుకుంటారు. ఏడాది పొడవునా గెంజి అన్నంతో పచ్చడి మాదిరిగా వినిమోగిస్తారు. కొన్ని గ్రామాల్లో మామిడి టెంకలను ఎండబెట్టి పిండిగా చేస్తారు. దీన్ని ఉడకబెట్టి అంబలిగా చేసుకొని గిరిజనులు ఆరగిస్తారు. మామిడి పండ్ల టెంకలతో కూరను కూడా తయారు చేస్తారు.

వారపు సంతల్లో తాండ్రకు డిమాండ్

మన్యంలో గిరిజనులు తయారు చేసే తాండ్రకు మంచి గిరాకీ ఉంది.తాండ్రను మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కిలో రూ.100 నుంచి రూ.120 వరకు కొనుగోలు చేస్తున్నారు.ఎటువంటి రసాయనాలు లేకుండా తయారు చేయటంతో మన్యం ప్రాంత తాండ్రపై వ్యాపారులు మక్కువ చూపిస్తున్నారు. తాండ్రను ముక్కలుగా చేసి సైతం వ్యాపారలు ముక్కను రూ.10 చొప్పున అమ్మకాలు చేస్తున్నారు.మామిడి తాండ్రతో పాటు పలు రకాలుగా మామిడి పండ్లు గిరిజనులకు ఆర్థిక చేయూత అందిస్తున్నాయి.

ధరలు బాగున్నాయి

ప్రతి ఏడాది మామిడి మా కుటుంబాలకు ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుంది. మొదటిలో మామిడి తాండ్రను ఇంటిలో వాడకం కోసం మాత్రమే తయారు చేసేవారం. వారపు సంతలో తాండ్రకు డిమాండ్ పెరగడంతో అమ్మకాలకు తయారు చేస్తున్నాం. కొంత మంది వ్యాపారులు ఇంటికి వచ్చి మరి తాండ్రను కొనుగోలు చేస్తున్నారు.సహజసిద్ధంగా తాండ్ర తయారు చేయడం, మంచి రుచిగా ఉంటుంది. తాండ్ర ధరలు బాగున్నాయి.

– ఎస్.లక్ష్మి, సుజనకోట గ్రామం, ముంచంగిపుట్టు మండలం

వలంటీర్లకు సన్మానం



సేవా వజ్రకు ఎంపికైన కౌశల్యను సన్మానిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, ఎంపీపీ రమేష్, జెడ్పీటీసీ నూకరాజు తదితరులు

కొయ్యూరు: గ్రామ వలంటీర్లు సేవా వారధులని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వలంటీర్లకు సోమవారం వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలందించిన వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రామ వలంటీర్ల ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా సేవలందిస్తున్నారన్నారు. మారుమూల ప్రాంతాలకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను సక్రమంగా సకాలంలో లబ్ధిదారులకు అందజేస్తున్న వలంటీర్లు సేవలు హర్షణీయమన్నారు.

ప్రభుత్వ సేవలందిస్తున్న గ్రామ వలంటీర్లకు వందనమని అభివర్ణించారు. నియోజకవర్గంలో గూడెం కొత్తవీధి మండలంలో 350మంది వలంటీర్లు ఉండగా వారిలో 47 మందికి, కొయ్యూరులో 320 మంది ఉండగా వారి 120 మందికి మాత్రమే సేవా మిత్ర వచ్చిందన్నారు. నాలుగేళ్లలో వలంటీర్ల కోసం నియోజకవర్గంలో రూ.92.6 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు .సేవా వజ్రకు ఎంపికైన శరభన్నపాలెం–2కు చెందిన శెట్టి కౌశల్య, సేవారత్నలుగా ఎంపికైన వి.మకరజ్యోతి, గమధం శిరీష, కామోజు భూలక్ష్మి, రాజకుమారిలను ఘనంగా సన్మానించారు.ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తుండడంతో అభినందనీయమన్నారు. ఉత్తమ వలంటీర్లకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వలంటీర్లు తమ సమస్యలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి విన్నవించుకున్నారు. త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, జెడ్పీటీసీ వారా నూకరాజు, ఎంపీడీవో మేరీరోజ్, వైస్ ఎంపీపీలు నూకాలు, వెంకటరమణ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, సావిత్రి, సుధాకర్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



చిన్నయ్య(ఫైల్)

నర్సీపట్నం : ఏరియా ఆస్పత్రి సమీపంలో మెయిన్ రోడ్డు పక్కన ఓ వ్యక్తి మృతదేహం పడి ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని టౌన్ ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మండలంలో గురంధరపాలెంకు చెందిన దారపూడి చిన్నయ్య(50) వృత్తిరీత్యా తాపీమేస్త్రీ. రోజు మాదిరిగానే సోమవారం తాపీ పనికి వెళ్తున్నట్టు కుటుంబ సభ్యులకు తెలిపి అతను నర్సీపట్నం వచ్చాడు. అయితే మెయిన్‌రోడ్డు పక్కన మృతి చెంది పడి ఉన్నాడు. మృతికి కారణాలు తెలియరాలేదు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు అచ్చిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తొడులోడు వాహనం ఢీకొని వ్యాన్ బోల్తా



బోల్తా పడిన వ్యాన్



ప్రమాదం వద్ద సత్తిరాజు మృతదేహం



సత్తిరాజు(ఫైల్)

- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

కొయ్యూరు: డౌనూరు పంచాయతీ తులబాలగెడ్డ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సీపట్నంకు చెందిన ఎం.సత్తిరాజు (50) అనే వ్యక్తి మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడడంతో వారిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని కొయ్యూరు ఎస్ఐ రాజారావు సందర్శించి ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. ఆయన విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం నుంచి ఓ వ్యాన్ చింతపల్లికి వెళ్తుండగా ఎదురుగా ఒడిశా నుంచి తొడు లోడుతో వస్తున్న మరో వాహనం తులబాలగెడ్డ మలుపు వద్ద అదుపు తప్పి వ్యాన్‌ను ఢీకొందన్నారు. దీంతో వ్యాన్ బోల్తా పడి అందులో ఉన్న ఎం.సత్తిరాజు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారని తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన డ్రైవర్ గోవింద్, వంశీతో పాటు మరో మహిళను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని ఎస్ఐ తెలిపారు.

ఏఎన్ఎం ఇంట్లో చోరీ

ముంచంగిపుట్టు : మండల కేంద్రంలోని స్థానిక హాకీ గ్రౌండ్ సమీపంలో నివాసం ఉంటున్న బూసిపుట్టు సచివాలయ ఏఎన్ఎం నిక్కుల మణికుమారి ఇంటిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఇంటిలో ఎవరూ లేని సమయంలో తలుపులు బద్దలుగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి ఏఎన్ఎం మణికుమారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 28వ తేదిన మణికుమారి పాడేరులోని తన బంధువుల ఇంటికి శుభకార్యం నిమిత్తం వెళ్లారు. దీంతో ఇంటిలో ఎవరూ లేరని గుర్తించిన దొంగలు ఇంటి తలుపు బద్దలుగొట్టి ఇంటిలోకి ప్రవేశించి బీరువా తెరిచి ప్రభుత్వం అందించిన రెండు సామ్‌సంగ్ ఫోన్లు, చెవి దిద్దులు, కొంత నగదును తీసుకొని వెళ్లారు. సోమవారం ఉదయం మణికుమారి ఇంటికి వచ్చి చూసేసరికి తలుపు తెరించి ఉండడం, బీరువాలో ఉన్న ఫోన్లు,నగదు,చెవి దిద్దులు లేకపోవడంతో పాటు ఇంటిలో వస్తువులు అన్ని చిందరవందరగా పడి ఉండడంతో దొంగతనం జరిగినట్టు గుర్తించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రవీంద్ర చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఐఏఎస్ అధికారులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఆనంద్, ఐఏఎస్ అధికారి కార్తికేయ మిశ్రా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వీరి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో శ్రీనివాసరావు అందజేశారు.

కోడిపందాలపై పోలీసుల దాడులు

- ఏడుగురిపై కేసు నమోదు
- మూడు కోడిపుంజులు, రూ.2160 నగదు స్వాధీనం



పట్టుబడిన పందెంరాయుళ్లు, కోడిపుంజులతో ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది

కె.కోటపాడు : పిండ్రంగి గ్రామంలో కోడిపందాలు ఆడుతూ ఏడుగురు వ్యక్తులు ఎ.కోడూరు పోలీసులకు సోమవారం పట్టుబడ్డారు. గ్రామంలో కోడిపందాలు జరుగుతున్నట్లు ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు ఎస్.ఐ బి.రామకృష్ణ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ ఘటనలో కోడిపందాలు ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకోవడంతో పాటు వారి వద్ద ఉన్న రూ.2160 నగదు, మూడు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసును నమోదు చేసినట్టు ఎస్.ఐ రామకృష్ణ తెలిపారు.

108 వాహనంలో ప్రసవం

మాడుగుల రూరల్ : పురిటి నొప్పులతో బాధపడుతున్న బొడ్డరేవు గిరిజన గ్రామానికి చెందిన గర్భిణి పాడి సత్యవతి (22) సోమవారం ఉదయం 108 వాహనంలో ప్రసవం పొందింది. మండలంలోని శంకరం పంచాయతీ బొడ్డరేవు గ్రామానికి చెందిన ఆమె తొలికాన్పు కావడంతో ఉదయం పురిటి నొప్పులు మొదలయ్యాయి. దాంతో 108కు ఆశ కార్యకర్త గెమ్మిలి వరహాలమ్మ ఫోన్ చేయగా, బుచ్చెయ్యపేట నుంచి వచ్చిన అంబులెన్స్‌లో ఎక్కించారు. మార్గమధ్యంలో కాశీపురం అడ్డరోడ్డు వద్దకు రాగానే పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో వాహనం నిలుపుదల చేసి, అతి కష్టమ్మీద ఈఎంటీ ఎ.ప్రవీణ్‌కుమార్ ప్రసవం చేశారు. సత్యవతి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆశ కార్యకర్త సహకారంతో తల్లీబిడ్డను, కె.జె.పురం పీహెచ్‌సీకి తరలించారు. ఈఎంటీ ప్రవీణ్‌కుమార్, పైలట్ అప్పలరాజు, ఆశ సేవలను పలువురు ప్రశంసించారు.

పెయ్యదూడల జననానికి రాయితీపై ఇంజెక్షన్లు

ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి రామ్మోహనరావు



ఇంజెక్షన్‌తో జన్మించిన ఆడ పెయ్యలను పరిశీలిస్తున్న ఎగ్జిక్యూటివ్ అధికారి రామ్మోహనరావు

నాతవరం: పెయ్య దూడల ఉత్పత్తి పథకం ద్వారా పాడి రైతుల ఆర్థికాభివృద్ధి ధ్యేయంగా ఉమ్మడి జిల్లాలో 158 మంది గోపాలమిత్రులంతా పని చేయాలని ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి రామ్మోహనరావు అన్నారు. ఆయన సోమవారం మండలంలో శృంగవరం, జిల్లేడుపూడి. వెంకయ్యపాలెం గ్రామాల్లో కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్ ద్వారా జన్మించిన లేగదూడలను పరిశీలించారు. శృంగవరం పశువైద్యశాలలో గోపాలమిత్రులతో సమావేశమై మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం ద్వారా మేలైన పెయ్య దూడలు 90 శాతం జన్మిస్తాయన్నారు. ఆడ పెయ్య పుడితే పాల ఉత్పత్తి పెరిగి రైతులకు ఆదాయం బాగుంటుందన్నారు. కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్ రూ.1,350 కాగా ప్రభుత్వం రైతుకు రాయితీపై రూ.500కే సరఫరా చేస్తుందన్నారు. ఒక వేళ ఇంజెక్షన్ పని చేయకపోతే రైతు సొమ్ము వాపసు చేస్తామన్నారు. గతేడాది ఉమ్మడి జిల్లాలో 3 వేల డోసులు 1,500 పశువులకు చేశామని, ఈ ఏడాది 5 వేల డోసుల వేసి 2,500 పశువులకు ఆడ పెయ్యల జననం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

పశువులు మరణిస్తే రైతుకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పశు వైద్య బీమా సదుపాయం కల్పిస్తుందన్నారు. పశు వైద్యశాఖ పాయకరావుపేట ఏడీ శ్రీనివాసరావు గోపాల మిత్రులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన శుద్ధి కర్మాగారంతో రైతులకు మేలు

కోటవురట్ల : రైతులకు ఎంతగానో ఉపకరించే విత్తన శుద్ధి కర్మాగారం స్థానికంగా అందుబాటులో ఉండడం అభినందనీయమని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. తంగేడులో నూతనంగా నిర్మించిన విశాఖ సీడ్స్ విత్తన శుద్ధి కర్మాగారాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగతంగా ఎదిగేందుకు ఒక్కొక్కరూ ఒక్కో వ్యాపారాన్ని ఎంచుకుంటారని కానీ తంగేడు గ్రామ సర్పంచ్ కొరుప్రోలు శివకుమార్ సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేసి 3 జిల్లాల రైతులకు ఉపయోగ పడేలా విత్తన శుద్ధి కర్మాగారాన్ని నిర్మించడం గొప్ప విషయమన్నారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా నాణ్యమైన విత్తనాలు అందించి రైతులకు తోడ్పాటును అందించాలని సూచించారు. వరితో పాటు, అపరాల పంటలకు సంబంధించిన విత్తనాలు ఇక్కడ శుద్ధి చేయబడతాయన్నారు. ప్రభుత్వం తరపున కూడా సహకారం అందిస్తామని, రైతులకు మంచి విత్తనాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ సర్పంచ్ శివ విశాఖ సీడ్స్ కంపెనీ స్థాపించినందుకు అభినందించారు. ఈ ప్రాంత ప్రజలకు ఇది గొప్ప అవకాశం అన్నారు.

జీడికి సిండికేట్ దెబ్బ

- దిగుబడి ఉన్నా రాని ధర
- రేటు తగ్గించేసిన వ్యాపారులు
- రెండు నెలల కిందటితో పోల్చితే బస్తాకు రూ.2000 తక్కువ



ఫ్యాక్టరీలో జీడి పప్పు తయారు చేస్తున్న మహిళలు

నాతవరం: జీడి పిక్కల ధరలు నేలచూపు చూస్తున్నాయి. ప్రకృతి కరుణించి దిగుబడి పెరిగినా రేటు తగ్గిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర తగ్గించేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో ఉన్న ధరతో పోలిస్తే ఇప్పుడు బస్తాకు రూ.2 వేల వరకూ తగ్గింది. జిల్లాలో వరి పంట తరువాత అధిక విస్తీర్ణంలో రైతులు జీడి మామిడి తోటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది జీడి పూతపై మంచుపడడంతో మొదట్లో అన్నదాతలు కంగారు పడ్డారు. తర్వాత వాతావరణం అనుకూలించడంతో ఆశించిన విధంగానే జీడి పిక్కల దిగుబడి వచ్చింది. జిల్లాలో 24 మండలాల్లో సుమారుగా 31 వేల హెక్టార్లలో జీడి మామిడి తోటలు సాగు చేస్తున్నారు. నాతవరం, రావికమతం, చోడవరం, యలమంచిలి, రోలుగుంట ఎస్.రాయవరం, మాకవరపాలెం, గొలుగొండ, నక్కపల్లి, కశింకోట, కోటవురట్ల తదితర మండలాల్లో అధికంగా జీడితోటలున్నాయి. ఉద్యానవనశాఖ అధికారుల లెక్కల ప్రకారం ఈ ఏడాది ఎకరానికి 400 కిలోలకు పైగా దిగుబడి వచ్చింది. దీన్ని బట్టి పరిశీలిస్తే హెక్టారుకు వెయ్యి కిలోల జీడి పిక్కల దిగుబడి లభించింది. జిల్లాలో జీడి పిక్కల ఫ్యాక్టరీలు పెద్దవీచిన్నవి కలిపి 150కి పైగా ఉన్నాయి. కేరళ రాష్ట్రానికి చెందిన వారు నాతవరం, నర్సీపట్నం, రోలుగుంట, కశింకోట, కోటవురట్ల, పాయకరావుపేట, నక్కపల్లి, మాకవరపాలెం, అనకాపల్లి, యలమంచిలి తదితర మండలాల్లో మండలానికి రెండు నుంచి నాలుగు చొప్పున పెద్ద ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. అదే చిన్న ఫ్యాక్టరీలు అయితే ప్రతి గ్రామంలో ఏర్పాటు చేశారు.

రైతులు పండించిన జీడి పిక్కలను జీడి పరిశ్రమ యాజమాన్యాలు నేరుగా కొనుగోలు చేయడం లేదు. ప్రైవేటు వ్యాపారుల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. మొదట్లో మార్చి నెలలో 80 కిలోల బస్తాను రూ.8500 నుంచి రూ.9వేల ధరతో కొనుగోలు చేశారు. అప్పట్లో జీడి పిక్కలు దిగుబడి తక్కువగా ఉండేది. ఏప్రిల్ నుంచి జీడి పిక్కలు దిగుబడి పెరగడంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి ఒక్కసారిగా బస్తా ధరను రూ.6300కు తగ్గించేశారు.

ఇప్పుడు పిక్కల నాణ్యత పేరుతో గ్రామంలో ఇష్టం వచ్చిన రేటుకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇంతకు ముందు జీడి పిక్కల కొనుగోలుకు బయటి జిల్లాల నుంచి వ్యాపారులు వచ్చేవారు. ఇప్పుడు స్థానికంగా ఉన్న వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ఇతర ప్రాంతాల వ్యాపారులను ఇక్కడికి రాకుండా అడ్డుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. నేరుగా ఫ్యాక్టరీ యాజమాన్యాలు రైతుల నుంచి కొనుగోలు చేస్తే జీడి పిక్కలకు మద్దతు ధర వస్తుందని అంటున్నారు.

డీఆర్‌డీఏ ద్వారా కొనుగోలు చేయాలి



ప్రైవేటు వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి జీడి పిక్కల రేటు పెరగకుండా చేస్తున్నారు. గతంలో డీఆర్‌డీఏ అధికారుల ఆధ్వర్యంలో ప్రైవేటు కంపెనీల యాజమాన్యాలు జీడి పిక్కలు కొనుగోలు చేసేవారు. అప్పట్లో రైతుకు గిట్టుబాటు ధర వచ్చేది. మళ్లీ అదే విధంగా రైతుల నుంచి జీడిపిక్కలు కొనుగోలు చేస్తే దళారీలకు అడ్డుకట్ట వేసినట్టు అవుతుంది. ఈఏడాది పంట రాకముందు రేటు అధికంగా ఉండేది. పిక్కలు వచ్చాక రేటు బాగా తగ్గించేశారు. రేటు లేక పిక్కలను ఇంట్లోనే నిల్వ చేసుకున్నాను. – టి.తాత, జీడి రైతు, నాతవరం

వచ్చే ఏడాది నుంచి కొనుగోలు చేస్తాం



రైతుల నుంచి నేరుగా ఓలం జీడి పరిశ్రమ యాజమాన్యం జీడి పిక్కలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల కంపెనీ యాజమాన్యం, వెలుగు అధికారులు చర్చించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వచ్చే ఏడాది నుంచి జీడి రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయించి, దళారీ వ్యవస్థకు చెక్ పెడతాం.

– మర్రి లక్ష్మి, వెలుగు ఏపీఎం, నాతవరం